కథా కౌముది

# జాతర - ఎ.విజయకుమార్

**అమ్మవారి జాతర** ఆ రోజు. సంవత్సరానికి ఓ సారి వచ్చే ఆ జాతర అంటే ఊరంతటికి మహా సరదా. అయిదురోజులు పాటు సాగే ఆ జాతర కన్నుల పండువుగా ఉంటుంది. బుధవారం తీసుకువచ్చిన అమ్మవారిని ఆదివారం తిరిగి గుడికి చేర్చడం ఆనవాయితీ. ఆ అయిదు రోజులు తెల్లవారుఝాము వరకు సినిమాలు, హరికథలు, బుర్రకథలు, అప్పుడప్పుడు కుర్రకారుని ఆకర్షించడానికి అనకాపల్లి నుంచి రికార్డింగ్ డాన్సు తెచ్చి ఆడిస్తారు....

రోజూ సాయంత్రం అమ్మవారి స్థానంలో సింధూరం పూసిన కత్తిని ఉంచి పూజ చేస్తారు. పసుపు రాసిన ఘటాలను ఊరేగిస్తారు. ఈ తంతు అంతా జరిగిన పూజారికి అమ్మవారు పడుతుంది. పూజారి అప్పుడు అరుస్తూ, గెంతుతూ, ఊగిపోతూ నృత్యం చేస్తాడు. చివరి రోజున పూజారి పులి అయిపోతాడు. అప్పుడు అచ్చం పులిలాగానే పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ జనం మీదకు వస్తాడు. అక్కడున్న అసిస్టెంట్ పూజారులు అతన్ని నిరోధిస్తుంటారు.

ముందురోజే చుట్టాలందరూ మా ఇంటికి చేరారు. అత్తలు, మామయ్యలు, పిన్నిలు, బాబాయిలు, అక్కలు, తమ్ముళ్ళు... ఓహ్.. మొత్తం బెటాలియన్తో మహాసందడిగా ఉంది. అన్నయ్యలు, అక్కలు అంతా కలిసి కారమ్స్ ఆడుతున్నారు. నేను తమ్ముడితో కలిసి చెస్ ఆడుతున్నాను. చెస్ అంటే చాలా ఇష్టం నాకు. ఇంతలో "ఒరేయ్ విష్ణు...!" నాన్న గొంతు వినపడింది.

అయిదు క్వార్టర్ బాటిల్స్ తెమ్మని డబ్బులు ఇచ్చాడు నాన్న. ఒక్కో క్వార్టర్కి పదిరూపాయలు కమీషన్ కూడా ఇచ్చాడు. మామూలు సమయాలలోనే తాగడం మానడు. ఇక పండగ సమయాల్లో అస్సలు ఎవ్వరు చెప్పిన వినడు. తాగొద్దని చెప్తాననే కాబోసు నాకు కమీషన్ కూడా ఇచ్చేది. నాకు ఇచ్చే కమీషన్ డబ్బులు ఎప్పుడు అమ్మకిచ్చేస్తుంటాను. మాకేమి తక్కువ చేయకపోయినా తన బలహీనతలని మాత్రం వదులుకోలేదు.

* * *

"ఏరా...! దేవతకి తిండి పెట్టరా...?" అడిగాడు నాన్న.

"పెడుతున్నాం....! " చెల్లి సమాధానం

"బ్యాండ్ వాళ్ళకి కబురు పెట్టారా...?" మళ్ళీ అడిగాడు

"ఇందాకడే చెప్పి వచ్చాను. వాళ్ళు వచ్చేసారు కూడా... చెప్పాన్నేను"

"మళ్ళీ పెండాల్ దగ్గర జనం ఎక్కువైపోతారు పదండి...." తొందర చేసాడు.

అమ్మ ఎర్ర చీర, పసుపు, కుంకుమ, ఎర్ర మట్టిగాజులు, ఎర్ర పువ్వులు అన్నీ కలిపి ఓ కంచంలో వేసి పట్టుకుంది. అమ్మవారికి ఎరుపు రంగంటే ఇష్టమని అందరి నమ్మకం. అందుకే ఎరుపు రంగు పూలతోనే పూజిస్తారు. అందరం కలిసి పెండాల్ దగ్గరికి

బయలుదేరాం. తాగిన వాళ్ళంతా బ్యాండ్ వాళ్ళ శ్రుతికి తప్పటడుగుల తాళం వేస్తున్నారు. లోపల నుంచి "దేవతని" తీసుకువచ్చి ఎర్ర సింధూరం పెట్టి మెళ్ళో మారేడు ఆకుల దండ వేసి మేళ తాళాలతో ఊరేగిస్తూ బయలుదేరారు.

"పాపం నాన్న... ఆ మేకని ఇవ్వాళ్ళ చంపేస్తారా...?"

"తప్పమ్మా...." అది మొక్కుబడి మేక. దాన్ని మేక అనకూడదు. దేవత అనాలి. చంపడం అనకూడదు. మొక్కు తీర్చుకోవడం అనాలి... లెంపలేసుకో".... అంటూ నా లెంపలు వాయించాడు.

"చంపడం తినడంలాంటివి విచక్షణ జ్ఞానం లేని జంతువులు చేసే పని. మరి ఆ జంతువులనే చంపుకు తినే మనం మనుషులమా లేక దయ్యాలమా....?"

ఆ మేక కదలటానికి మొరాయిస్తుంది. దానికి ముందుగా తెలిసిపోయినట్టుంది. భయంతో బిక్కచచ్చిపోయింది. ఫలానా రోజు చస్తావని తెలియడం వరం అంటారు. కానీ నన్నడిగితే అదో పెద్ద శాపం అంటాను. ఇలాంటప్పుడే అనిపిస్తుంది. "మనిషికి కూడా ఇలాగే దండ వేసి నుదుటున సింధూరం పెట్టి, మెళ్ళో దండ వేసి, ఊరేగించి బలిస్తే అప్పుడు తెలుస్తుంది ఆ నరకయాతన. ఉరిశిక్ష వేసే ఖైదీకి కూడా సుఖంగా మరణించాలని ముందు స్పృహ తప్పేలా చేసి తరువాత ఉరి తీస్తారు. కరుడుగట్టిన ఖైదీలపై ఉండే ఆ అనుగ్రహం ఏ పాపం తెలియని ఈ మూగ జీవాలపై ఎందుకుండదు?"

"పాముని చూస్తే భక్తితో దండం పెడతాం. పులిని చూస్తే భయంతో పారిపోతాం. అదే మేకని చూస్తే బలిస్తాం లేదా కూర వండుకు తింటాం. ఎందుకంటే అది మన దౌర్జన్యాన్ని మౌనంగా సహిస్తుంది. తిరగబడే స్వభావం లేనిది." మేక మెడకు ఓ తాడుని కట్టి బలంగా ముందుకు లాక్కెళుతున్నారు. అది మెడ అటు ఇటు ఆడిస్తోంది. అయినా దాని గోడు ఎవరూ పట్టించుకోవటం లేదు. అది ముందర కళ్ళ దన్నుతో వెనక కాళ్ళను ఆసరాగా పెట్టి కదలటానికి మొరాయిస్తోంది. అయినా సాయుధులు దాన్ని బలంగా లాక్కెళుతున్నారు.

అది అదోరకంగా చూస్తోంది. ఆ చూపులో పాపం చేస్తున్న వాళ్ళకి కసి పగ, చేయని వాళ్ళకి జాలి కనపడుతూంది. ఆ మేక మే... మే... అంటూ బేలగా అరుస్తోంది. "నేను మీకు ఏం అన్యాయం చేసాను? కడుపు కొట్టానా? కాలు కొట్టానా? నా మీద ఎందుకు ఈ కక్ష? నన్ను బతకనివ్వండి" అన్న అభ్యర్ధన ఆ కళ్ళల్లో, చూపులలో, అరుపులో, అర్ధమౌతోంది." సాయుధులు తమ బలాన్నంతా ఉపయోగించి పెండాల్ దగ్గరకు లాక్కొచ్చారు. అప్పటికే పెద్ద క్యూ ఉంది.

మా ముందర ఒక మనిషి కోడిని పట్టుకుని ఉన్నాడు. కోడి, మేక, ఒకదానినొకటి జాలిగా చూసుకున్నాయి. ఆ చూపులో ఒకదానినొకటి ఓదారుస్తున్నట్టుగా అనిపిస్తుంది. పూజారి ఆ కోడికి సింధూరం పెట్టి పూజ చేసి అమ్మవారి దగ్గరున్న బియ్యం తినిపించాడు. కాని ఆ కోడి తినలేదు. అలా తింటేనే ఆ కోడి మనస్పూర్తిగా బలికి ఒప్పుకున్నట్టట. పూజారి దానిచేత బలవంతంగా తినిపించాడు.

తరువాత మా మేకకి పూజ చేసాడు. అక్కడున్న వేపాకుల గుత్తితో దాని మీద మూడు సార్లు కొట్టాడు. ఏవో మంత్రాలు చదివాడు. ఎర్ర సింధూరం అప్పటికే దాని నెత్తిన ఉన్నా మళ్ళీ పెట్టాడు. నల్ల మేక ముఖం ఆ సింధూరంతో ఎర్రగా మారిపోయింది. దాన్ని పెండాల్ వెనకగా తీసుకుని వెళ్ళమన్నాడు. పెండాల్ వెనకనే ఈ పశువులన్నిటిని బలి ఇచ్చేది. "ముందర భక్తితో నమస్కారాలు. వెనకనేమో ఈ క్రూరత్వాలు." మేకని పెండాల్ వెనకగా తీసుకెళ్ళాము.

ఆకాశంలో చుక్కల్లా అడుగు పెట్టటానికి కూడా వీల్లేకుండా అప్పటికే తీసిన కోడి ఈకలు, తెగిపడిన తలలు. అదంతా ఓ స్మశాన వాటికలా ఉంది. ఇంకా చెప్పాలంటే అదంతా ఓ యుద్ధభూమిలా ఉంది. అక్కడ ఓ పక్కగా కోళ్ళని మరో పక్కగా మేకల్ని, గొర్రెల్ని నరుకుతుంటారు. నరికిన తర్వాత అక్కడే ఓ దూలానికి మేక మొండాన్ని వేలాడదీసి దానిపై చర్మాన్ని ఒలుస్తారు. దాని

గుండెకాయని వేరు చేస్తారు. దాని మాంసాన్ని బంధువులందరికి పంచుతారు. సమవర్తి కూడా ఇంత వికృతమైన శిక్షలు వెయ్యడే అనిపిస్తుంది. ఇదంతా చూస్తే?

చివరగా మా మేక వంతూ వచ్చింది. నాకు తెలియకుండానే నా కళ్ళవెంబడి నీరు రాసాగింది. మూడు నెలలు ఆప్యాయంగా దాన్ని పోషించేది మనం నరుక్కుతినడానికా...? వీటన్నిటిని నరకడానికి కమిటీ వాళ్ళు ముల్లు అనే మనిషిని ఉంచుతారు.

గత సంవత్సరం నరుకుతుంటే చూసాను. అప్పటినుంచీ నాకు భయమే!..! పెద్ద పదునైన గొడ్డలి తీసుకొచ్చాడు. ఇంత చిన్న జీవిని చంపడానికి అంత పెద్ద గొడ్డలి అవసరమా అనిపించింది.

"ఒరేయ్ ముల్లు మొండెంకి మొయ్యగా నరుకు. ఎక్కువ మాంసం వస్తుంది. కమిటీ వాళ్ళు చెప్పి పంపించారు. ఎందుకంటే మేక ముందు భాగం మెడ కమీటీ వాళ్ళది. వెనక మొండెం మాత్రమే బలి ఇచ్చినవాళ్ళది"

గత సంవత్సరం చూసిన సంఘటన మనసులో మెదిలింది.

***

ఆరోజు మేక మెడకు ఓ తాడుని కట్టి బలంగా ముందుకు లాగాడు. అలాగే వెనకకి కాళ్ళకి కూడా ఓ తాడుని కట్టి అంతే బలంగా లాగాడు. మేక గింజుకుంటున్నా, అరుస్తున్నా, వేడుకుంటున్నా వినిపించుకోకుండా కర్కశంగా క్రూరంగా, నిర్దయుడిగా, ఒక్క వేటుతో ఆ మేకతలని నరికాడు.

ఒక్కసారిగా తెగిపడడంతో తాళ్ళని పట్టుకున్న వాళ్ళు ఆ బలానికి కింద పడ్డారు. ఫౌంటైన్ నుంచి నీరు త్రుళ్లినట్టుగా రక్తం అక్కడున్న వాళ్ళ ముఖం మీద చిమ్మింది. తల మొండెం నేలమీద వేరువేరుగా పడ్డాయి. తలలో ఆ అభ్యర్ధన నిండిన కళ్ళు ఇంకా తెరిచే ఉన్నాయి. ఏ కోసానో ప్రాణం ఉంది కాబోసు.... కాళ్ళు ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాయి. అలా కొట్టుకుంటూ, విలవిలలాడిపోతూ ఆ కళ్ళతోనే శాపనార్ధాలు పెడుతూ ఆ మేక నేలకొరిగిపోయింది.

***

ఆ దృశ్యం ఇంకా కనురెప్ప దాటిపోలేదు. కళ్ళ ముందర కదలాడుతూనే ఉంది. ఒళ్ళంతా జలదరించింది. అందుకే నేను చెల్లి భయమేసి చెట్టు చాటుకి వెళ్ళి దాక్కున్నాం. ఇంతలో....

"పట్టుకోండిరా మేకని పారిపోతోంది...". అరుపు వినపడింది. మేక సింహం జూలు విదిలించినట్టుగా తన బుర్రని అటు ఇటు ఆడిస్తూ ఊగిపోతోంది. దాన్ని పట్టుకోడానికి సాయుధులు చేసే ప్రయత్న ఫలించటంలేదు. అప్పుడే హఠాత్తుగా ఎక్కడినుంచో అమ్మవారి గొంతు వినపడింది. అంతా ఒక్క క్షణం నిశ్చలంగా ఉండిపోయారు.

"ఒరేయ్. ఏమిరా నేను చెప్పానా...? మూగజీవాన్ని బలివ్వండి అని. మీరే కొబ్బరికాయలు కొడుతున్నారు. మీరే తింటున్నారు. మీరే నా పేరు చెప్పి కోళ్ళను, మేకలను బలిచ్చి భోంచేస్తున్నారు. గుడికి వచ్చి పూజారి ఒక చిప్ప ఇస్తాడా... రెండు చిప్పలు ఇస్తాడా. అని ఆలోచిస్తూ మనసు నా మీద లగ్నం చేయలేని మీరు ఎంతో ఆర్భాటంతో మేళ తాళాలతో వీటితో నాకు రక్తతర్పణం చేస్తే స్వీకరిస్తాననుకున్నారా. దైవశక్తి ఒక్క భక్తికే లొంగుతుందన్న విషయం ఇకనైనా గ్రహించండి. నాకు భక్తితో చిన్న అరటిపండు ఇచ్చినా సంతోషమే..." అని చెప్పింది.

అంతే....! మేక అలా అలా ఊగుతూ కింద పడిపోయింది. వెంటనే మేకని వదిలేసారు. నాకు చెల్లికి చాలా ఆనందం వేసింది.

నాతో సహకరించిన చెల్లి మళ్ళీ అమ్మవారి నుండి మామూలు మనిషి అయింది.

మేక అలా హఠాత్తుగా విదిలించి వదులుకోవడానికి కారణం కమీషన్ డబ్బులుతో కొన్న క్వార్టర్ బాటిల్ అని అక్కడ ఎవరికీ తెలీదు. నేను చెప్పను కూడా...! ***